సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 15 । జూలై । 2025



గ్యాంగ్‌ల దాడులు.. ప్రజలు బెంబేలు

ప్రశాంతంగా ఉన్న రాయచోటి పట్టణంలో.. ఇటీవల గ్యాంగుల దాడులు, ప్రతిదాడులతో పట్టణ ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. - 8లో



కుప్పానికి నీళ్లు తీసుకెళ్తే.. మా పరిస్థితి ఏంటి?

హంద్రీనీవా కాలువ ద్వారా కుప్పానికి మాత్రమే నీళ్లు తీసుకెళితే మా పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.260	రూ.330
రెండోరకం	రూ.180	రూ.240

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 940 మెట్రిక్ టన్నులు



మహా విషాదం



మృతదేహాలవద్ద విలపిస్తున్న బంధువులు



మృతులు చెంచమ్మ(54), చిట్టమ్మ(30), వి. శ్రీను(28), గజ్జలగంగమ్మ(33), గజ్జలదుర్గయ్య(37), ముని చంద్ర(26), రాధమ్మ (31), జానీ (15), సుబ్బరత్నమ్మ (31) (ఫైల్)

- కన్నీటిలో శెట్టిగుంట ఎస్టీ కాలనీ
- ఎవరిని కదిపినా కన్నీరే
- రాజంపేట హాస్పిటల్‌లో పూర్తయిన పోస్టుమార్టం

సాక్షి రాయచోటి/రైల్వేకోడూరు అర్బన్ : అమాయక గిరిజనులు...పొట్టకూటి కోసం.. రోజువారి కూలీ కోసం ఊరుగాని ఊరొచ్చారు. ఎంతోకొంత సంపాదించుకోవచ్చని ఆశపడ్డారు. ఆ ఆశలపై విధి చిన్నచూపు చూసింది. ప్రమాదమై దూసుకొచ్చి విషాదగీతిక రాసింది. రాజంపేట-రైల్వేకోడూరు మధ్యలోని పుల్లంపేట మండలం రెడ్డివారిపల్లె చెరువు కట్టపై జరిగిన ప్రమాదం ఆయా కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. జీవితానికి సరిపడా చేదు జ్ఞాపకాల్ని మిగిల్చింది.

వారి వేదన...అరణ్య రోదన

అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు పరిధిలోని శెట్టిగుంట యానాదుల కాలనీలో బాధిత కూలీల కుటుంబాల రోదన అరణ్య వేదనగా మారింది. ఓ వైపు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూనే...తెల్లవారిన అనంతరం మృతదేహాల వద్దకు వారు వచ్చారు. ప్రమాదంలో మృతి చెందిన వారంతా బంధువులే. ఒకరునొకరు వరుసకు సోదరుడు, బావమరిది, చిన్నమ్మ, భర్త ఇలా... ఒకరినొకరితో బంధుత్వాలు కలిగి ఉన్నారు. అంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో వారి బంధువుల ఆవేదన వర్ణణాతీతంగా మారింది. రాజంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద వివరాల కోసం సమాచారం అడుగుతున్నా చెప్పలేని పరిస్థితుల్లో ఉండిపోయారు.

కాలనీలో కన్నీటి ఘోష

రైల్వేకోడూరు పరిధిలోని యానాదుల కాలనీలో కన్నీటి ఘోష కనిపిస్తోంది. కాలనీకి చెందిన 9 మంది మృతి చెందడం, మరో 13 మందికి గాయాలు కావడంతో ఆ ప్రాంతమంతా తల్లడిల్లిపోయింది. కొద్దిసేపట్లో గమ్య స్థానానికి చేరుకుంటారని అనుకుంటున్న తరుణంలోనే ఇలా ఒక్కసారిగా ఉపద్రవం ముంచుకొచ్చిందంటూ తలుచుకుని కన్నీటిపర్యంతమవుతున్నారు.

పొట్టకూటికోసం వచ్చి....

అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు పరిధిలోని శెట్టిగుంట ఎస్టీ కాలనీలోకి కొంతమంది యానాదులు పనుల కోసం వలస వచ్చారు. ప్రధానంగా వెంకటగిరి, రేణిగుంట పరిధిలోని రెండు గ్రామాలకు చెందిన సుమారు 20-30 కుటుంబాలు పనుల కోసం వచ్చాయి. పొట్టకూటికోసం ఎక్కడో దూర ప్రాంతాల నుంచి పనుల కోసం వలసవచ్చి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

రోడ్డు ప్రమాద ఘటనలో గాయపడిన వారిని రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఇతరవైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. మార్చురీ వద్ద మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాలకు ప్రగాడ సానుభూతి తెలియజేశారు. ఇంత పెద్ద ఘటన జరగడం బాధాకరమని, వెంటనే ప్రభుత్వం బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇంతవరకు ప్రభుత్వం పరిహారం ప్రకటించకపోవడంపై మండిపడ్డారు. వెంటనే ఆదుకునే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.

అతివేగమే ప్రాణం తీసిందా

రెడ్డిపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో డ్రైవర్ నిర్లక్ష్యం, అతి వేగం ప్రాణం తీసిందని తెలుస్తోంది. దీనికి తోడు కూలీలను తీసుకెళ్లే మేస్త్రీ, వ్యాపారులు పని చేయించుకొని వారిని వదిలేశారు. వారి తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు చేయకుండా రాత్రి వేలలో నిబంధనలకు విరుద్ధంగా అంత మందిని లోడ్ పైన ఎక్కించి ప్రయాణం చేయించడంపై బాధితుల బంధువులు మండిపడుతున్నారు.

అనాథలైన పిల్లలు

గజ్జల గంగమ్మ, దుర్గయ్యలు ప్రమాదంలో మృతి చెందడంతో వారిపిల్లలు సునీతమ్మ, రాజీ, గంగయ్యలు అనాథలయ్యారు. మృతదేహాలవద్ద వారి తాత పిల్లలను ఓదార్చలేక పోయాడు.

ఒకే చోట అంత్యక్రియలు

ఆఊరికి ఎప్పుడూ లేనంత కష్టం వచ్చింది. ఒకేమారు నలుగురు మృతి చెందడం మృతదేహాలను ఖననం చేయడానికి గుంతలు తీయడానికి సమయం సరిపోలేదు. దీంతో జేసీబీతో గుంతలు తవ్వి ఖననం చేశారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి



మేడా రఘునాథరెడ్డి

రాజంపేట : పుల్లంపేట మండలంలోని రెడ్డిపల్లె చెరువుకట్టపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రెక్కాడితేకాని డొక్కాడని కుటుంబాలకు ఇలా జరగడం చాలా బాధకరమన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తునన్నారు. హాస్పిటల్ చికిత్స పొందుతున్న త్వరగా కోలుకోనే విధంగా వైద్య సేవలందించాల న్నారు.



అనాథలైన పిల్లలు

అమ్మా... ఎందుకు ఏడుస్తున్నావు!



భర్త మృతితో తల్లడిల్లిపోతున్న విజయలక్ష్మి.. తల్లిని అమాయకంగా చూస్తున్న ఆమె పిల్లలు

ఈ ఫొటోలో వీల్‌చైర్‌లో కూర్చొన్న మహిళ పేరు విజయలక్ష్మి . మామిడి పండ్లు లోడింగ్ చేసేందుకు భార్య,భర్త వెళుతూ చిన్న పిల్లలైన గంగోత్రి, చెంచితలను కూడా తీసుకెళ్లారు. అనుకోని ప్రమాదం ఎదురు కావడంతో విజయలక్ష్మి తన పిల్లలు ఇద్దరినీ గట్టిగా పట్టుకుని పడిపోయింది. దీంతో పిల్లలకు చిన్న పాటి గాయాలయ్యాయి. ప్రమాదంలో భర్త శ్రీనివాసులు మృతి చెందాడన్న వార్త జీర్ణించుకోలేక పోతోంది. విజయలక్ష్మికి గాయాలు కావడంతో నడవలేని స్థితిలో ఉంది. మరోవైపు విజయలక్ష్మి తండ్రి వెంకటయ్యకు కూడా చేయి విరగడంతో ఎదురుగా కూర్చొని విలపిస్తున్నాడు. ఏమీ తెలియని చిన్నారులు మాత్రం నాన్న లేరన్న విషయం తెలియక అమ్మా ఎందుకు ఏడుస్తున్నావు అంటూ వారు కూడా ఏడుస్తున్నారు. రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద సోమవారం కనిపించిన ఈ దృశ్యం చూపరులను కంటతడి పెట్టించింది.

క్షతగాత్రులకు ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి

రాజంపేట : రెడ్డిపల్లె చెరువుపై ఆదివారం లారీ బోల్తా సంఘటనలో క్షతగాత్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. రాజంపేట ప్రాంతీయవైద్యశాలలో ఉన్న క్షతగాత్రులను కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జరిగిన ప్రమాదసంఘటనపై సీఎంతో మాట్లాడనన్నారు. సీఎం సూచన మేరకు క్షతగాత్రులను పరామర్శించామన్నారు. బాధితు కుటుంబాలను ఏవిధంగా ఆదుకోవాలనే విషయం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి నిర్ణయం తీసుకుంటామన్నారు. కలెక్టరు శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ జరిగిన సంఘటన దురదృష్టకరమన్నారు.రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కారూపానందరెడ్డి, టీడీపీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు చమరి జగన్‌మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరిహారమేది!

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న కొరముట్ల

రాజంపేట : ప్రమాదం జరిగి 12 గంటలవుతున్న లారీ బోల్తా మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించకపోవడం కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమని రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే , వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికారప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. రాజంపేట ప్రాంతీయవైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిని కొరముట్ల పరామర్శించారు. అధికారులు, నామమాత్రంగా వచ్చి వెళ్లారన్నారు. నష్టపరిహారం ప్రకటించకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. గతంలో ఇదే తరహాలో ప్రమాదం జరిగితే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 24 గంటలు గడవకముందే బాధితులకు రూ.10లక్షలు ప్రకటించారన్నారు. ఇలాంటి ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, నేను అనేకసార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి రూ.2,300కోట్లు కడప-రేణిగుంట వరకు గ్రీన్ ఎక్స్‌ప్రెస్ హైవేని మంజూరు చేయించామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న ఇంతవరకు హైవే పనులు మొదలుకాలేదన్నారు. రైల్వేకోడూరు వైఎస్‌ఎంపీపీ ధ్వజారెడ్డి, సాయికిషోర్‌రెడ్డి, చెవ్వ శ్రీనివాసులరెడ్డి,జిల్లా యువజ న విభాగం అధ్యక్షుడు శివారెడ్డి, జెడ్పీటీసీ ర త్న మ్మ, మాజీ జడ్పీటీసీ రాజేశ్వరమ్మ పాల్గొన్నారు. క్షతగాత్రులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్,జనసేన పార్లమెంటరీ ఇన్‌చార్జి శ్రీనివాసరాజు, సీపీఎం నేతలు చంద్రశేఖర్, రవికుమార్ పరామర్శించారు. రాజంపేట ఏరియా హాస్పిటల్‌లో మృతదేహాలకు పోస్టుమార్టరం పూర్తి చేశారు. వారి బంధువులకు అప్పగించారు.ప్రాణాలతో బయటపడిన చిన్నారులను ప్రతి ఒక్కరూ పరామర్శిస్తున్నారు.

న్యూస్‌రీల్

ఘనంగా చక్ర, త్రిశూల స్నానం



సిద్దేశ్వరస్వామి, చెన్నకేశవస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

రాజంపేట : తాళ్లపాక బ్రహ్మోత్సవాలలో భాగంగా అన్నమాచార్య ధ్యానమందిరం ఆవరణంలోని కళ్యాణవేదికపై శ్రీ సిద్దేశ్వరస్వామికి త్రిశూలస్నానం, శ్రీ చెన్నకేశవస్వామికి చక్రస్నానం కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా ఉత్సవ మూర్తులకు అభిషేకాలు , ప్రత్యేకపూజలు జరిపారు. టీటీడీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. అంతకముందు వసంతోత్సవాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ సిద్దేశ్వరస్వామి, శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు.

తాళ్లపాక చెరువులో వెలుగులోకి ప్రాచీన శివలింగం



పురాతన శివలింగానికి పూజలు

రాజంపేట : పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాక చెరువులో నేరుడుగడ్డగా పిలిచే ప్రాంతంలో ప్రాచీన శివలింగం వెలుగులోకి వచ్చింది. సోమవారం చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా వెయ్యేళ్ల చరిత్ర కలిగిన సుమారు ఆరు అడుగుల ఎత్తు కలిగిన శివలింగం బయటపడింది. అదే విధంగా పురాతనమైన రోలు వెలుగుచూసింది. దీంతో గ్రామస్తులు, రాజంపేట పరిసర ప్రాంతాల ప్రజలు తండోపతడాలుగా తాళ్లపాక చెరువు వద్దకు చేరుకున్నారు. శివలింగానికి అభిషేకాలు, పూజలు చేశారు. శ్రీ సిద్దేశ్వరాలయం ప్రధాన అర్చకులు భక్తవత్సలం స్వామి పూజలు నిర్వహించారు. తాళ్లపాక చెరువులో వెలుగులోకి వచ్చిన పురానత శివలింగంపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, రిటైర్ పాలిటెక్నికల్ ప్రిన్సిపాల్ ఉద్దండం సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇక్కడతవ్వకాలు చేపడితే చరిత్ర బయటపడుతుందన్నారు. తాళ్లపాక చెరువు అభివృద్ధిలో భాగంగా శివాలయం కూడా నిర్మితం చేసే విధంగా టీటీడీ యోచించాలన్నారు.

బాధ్యతగా సమస్యలను పరిష్కరించాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం జేసి అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదు పరిష్కారంపై నేరుగా పర్యవేక్షిస్తోందని జేసీ తెలిపారు. అధికారులు ఫిర్యాదులను నూరుశాతం పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వినతులు..

వాల్మీకిపురం మండలానికి చెందిన అంజప్ప తన కుడికాలును అనారోగ్య కారణాల రీత్యా పూర్తిగా తీసివేశారని, తనకు త్రిచక్ర వాహనాన్ని ఇప్పించాలని జేసీకి విన్నవించుకున్నారు. నందలూరు మండలానికి చెందిన సాంబశివ నాయుడు తన కుమార్తెకు వివాహమైందని,ఆమె పేరును తన హౌస్ హోల్డ్ మ్యాపింగ్ నుంచి వేరు చేయాలని విన్నవించుకున్నారు. రాయచోటిలో నివసిస్తున్న చాంద్‌బాషా తనకు 75 సంవత్సరాల వయస్సు అని, ఎటువంటి పని చేయలేని పరిస్థితులలో ఉన్నానని, వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతి చేసుకున్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ మధుసూదన్ రావు, ఆర్డీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

రహదారి నిబంధనలు పాటించాలి: ఎస్పీ

పుల్లంపేట : పుల్లంపేట మండలం, రెడ్డిపల్లి చెరువు కట్ట వద్ద మామిడి కాయల లోడు లారీ బోల్తా పడటంతో 9 మంది మృతి చెందారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సోమవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అధిక లోడు, ఓవర్ స్పీడ్ వల్ల ప్రమాదం జరిగినట్లు పోలీసులు ఎస్పీకి వివరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. అధిక లోడు వాహనాలపై ప్రయాణించడం చట్టరీత్యా నేరమన్నారు. జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే, రాజంపేట పట్టణ సీఐ రాజ, రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, మన్నూరు సీఐ కుళాయప్ప, పుల్లంపేట ఎస్ఐ శివకుమార్, ఓబులవారిపల్లి ఎస్ఐ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

తల్లికి వందనం సరే.. కొత్త ఫించన్లు ఎప్పుడిస్తారో చెప్పండి

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి చుక్కెదురు

కురబలకోట : కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదికి పైగా కావస్తున్నా ఒక్క కొత్త ఫించన్ కూడా ఇప్పటి వరకు ఇవ్వలేదు..ఒక్క తల్లికి వందనంతో జీవితాలు సాగవని చంద్రబాబుకు చెప్పి కొత్త ఫించన్లు మంజూరయ్యేలా చూడాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి వివిధ గ్రామాల ప్రజలు విన్నవించారు. కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లో సోమవారం ఆయన నియోజక వర్గ టీడీపీ నాయకులు జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పర్యటించారు. మండలంలోని తూర్పు హరిజనవాడలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించారు.

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. సమీపంలోని కస్తూర్బా స్కూల్‌లో అదనపు తరగతి గదుగుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కాగా ఉదయం రావాల్సిన మంత్రి జిల్లాలోని పుల్లంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో లారీ బోల్తాపడిన ఘటనలో మృతుల కుటుంబాల పరామర్శకు వెళ్లి రావడంతో మధ్యాహ్నం నుంచి పర్యటన ప్రారంభించారు. తొలుత తూర్పు హరిజనవాడ, తర్వాత దాదంవారిపల్లె, గోళ్లపల్లెల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తల్లికి వందనం వచ్చిందా..ఉచిత గ్యాస్ వచ్చిందా అని మహిళలను అడిగారు. అయితే ప్రతి చోటా కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదికిపైగా కావస్తున్నా ఒక్క కొత్త ఫించన్ కూడా ఇప్పటి వరకు ఇవ్వలేదని మంత్రి ముందు వాపోయారు. చంద్రబాబుకు చెప్పి ఫించన్ల మంజూరుకు ప్రాధాన్యత ఇచ్చేలా చూడాలని కోరారు. సుపరిపాలనలో తొలి అడుగులో ఎక్కువ మంది కొత్త ఫించన్ల ఎప్పుడిస్తారని అడగడం విశేషం. అంగళ్లు సచివాలయ సముదాయం ప్రారంభోత్సవ అనంతరం అక్కడ జరిగిన ప్రెస్‌మీట్‌లో మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీడ్ మల్లికార్జున నాయుడు, చినబాబు, అంగళ్లు గ్రామ సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి, వైజి రమణ, పి. సురేంద్ర యాదవ్, వైజి సురేంద్ర,దాదం వెంకట్రమణారెడ్డి, అంగళ్లు శెట్టి సీతారాంతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో పూర్తిస్థాయిలో అన్నప్రసాద వితరణకు చర్యలు

టీటీడీ ఈఓ జె శ్యామలరావు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో భక్తులకు పూర్తిస్థాయిలో అన్నప్రసాద వితరణకు చర్యలు చేపట్టాలని టీటీడీ ఈఓ శ్యామలరావు అధికారులను ఆదేశించారు. టీటీడీ పరిపాలనా భవనంలోని కార్యనిర్వహణాధికారి ఛాంబర్‌లో జేఈఓ వి.వీరబ్రహ్మంతో కలిసి సోమవారం అధికారులతో ఈఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఒంటిమిట్టలో ఏప్రిల్ 11వ తేదీన జరిగిన కోదండరామస్వామి కల్యాణోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుమల తరహాలో ఒంటిమిట్టలో భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేయాలని ఆదేశించిన నేపథ్యంలో ఆలయం వద్ద తాత్కాలికంగా జర్మన్ షెడ్లు ఏర్పాటు చేసి ఆగస్టు నుంచి అన్న ప్రసాదాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు ఇంజినీరింగ్, అన్న ప్రసాదాల విభాగం అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఎఫ్ఏ అండ్ సిఏఓ బాలాజీ, సిఈ టివి సత్యనారాయణ, ఎస్ఈలు జగదీశ్వర్ రెడ్డి, మనోహరం, అన్నప్రసాదం, డిప్యూటీ ఈఓ రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

వైభవంగా పుష్పయాగం

ముగిసిన సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు



పుష్పయాగం నిర్వహిస్తున్న పండితులు

నందలూరు : నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత స్వామివారికి పుష్పయాగం వైభవంగా జరిగింది. చామంతి, గన్నేరు, మల్లెలు, రుక్షి, కనకాంబరాలు, రోజా, సంపంగి, తామర, కలువ, మొగలిరేకులు వంటి వివిధ రకాల పుష్పాలు, తులసి, మరువం, ధవనం వంటి ఆకులతో స్వామి, అమ్మవార్లకు యాగం నిర్వహించారు. పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, సునీల్‌కుమార్, సాయిస్వామిలు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెతో కారుచీకట్లు



రాయచోటిలోని జాతీయ రహదారిపై వెలగని వీధిలైట్లు



తాగునీటి సమస్య పరిష్కరించాలని ధర్నా చేస్తున్న ఇందిరమ్మ కాలనీ ప్రజలు

- నిలిచిన నీటి సరఫరా
- ఆందోళనలో పట్టణ ప్రజలు

రాయచోటి : మున్సిపల్ ఇంజినీర్ల సమ్మెతో రాయచోటి మున్సిపాలిటీ పురవీధులన్నీ చీకటిమయమయ్యాయి. తమ డిమాండ్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ శనివారం రాత్రి నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. దీంతో రెండు రోజులుగా పట్టణంలో వీధిలైట్లు వెలగలేదు. జాతీయ రహదారితోపాటు పట్టణంలోని ప్రధాన వీధుల్లో వీధిలైట్ల వెలుగులు లేకపోవడంతో ప్రజలు భయంతో ప్రయాణాన్ని సాగిస్తున్నారు. అలాగే తాగునీటి సరఫరా రాకపోవడంతో నీటి పాట్లు మొదలయ్యాయి. వెలిగల్లు, అన్నమయ్య ప్రాజెక్టుల నుంచి పంపింగ్ ద్వారా పట్టణానికి నీరు అందిస్తున్నారు. సంబంధిత ఇంజనీర్లు కూడా సమ్మెలో ఉండటంతో వాటిని నిర్వహణ ప్రైవేట్ వ్యక్తులకు సాధ్యం కాలేదు. దీంతో రెండు రోజులుగా పట్టణానికి నీటి సరఫరా ఆగిపోయింది.

నీటికోసం ధర్నా....

రాయచోటి మున్సిపాల్టీ పరిధిలో మాసాపేట, ఇందిరమ్మ కాలనీలలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని ఆ ప్రాంతాల ప్రజలు సోమవారం జిల్లా కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించారు. స్థానికంగా ఉన్న బోరులో సరిపడా నీరు రావడం లేదని కాలనీ ప్రజలు తెలియజేశారు. సదరు నీటి సమస్యలను పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతి చేశారు. మున్సిపల్ ఇంజినీర్ కార్మికులు సమ్మెలకు వెళ్లడంతో ప్రైవేట్ వ్యక్తుల ద్వారా నీటి సరఫరా అందించే చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ వాసు బాబు తెలిపారు. అలాగే రాత్రి వేళల్లో వీధిలైట్లు వెలుగుల పునరుద్దరణ కూడా చేపడతామని చెప్పారు.

సమస్యలను పరిష్కరించాలి

రాయచోటి : రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలపెంపు, సంక్షేమ పథకాల అమలు వంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రామాంజులు డిమాండ్ చేశారు. రాయచోటి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో న్యాయ సమ్మతమైన సమస్యలపై సోమవారం రెండోరోజు నిర్వధిక సమ్మెను ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టారు. ఈ సందర్భంగా నల్ల రిబ్బన్లను ధరించారు. దీక్షా శిబిరంలో వంటా వార్పుతో నిరసన చేశారు. సమ్మె వల్ల నీటి సరఫరా, వీధి దీపాలు, డ్రైనేజీ ఇతర అత్యవసర పౌర సర్వీసులకు పలు పట్టణాలు, నగరాల్లో అంతరాయం ఏర్పడినట్లు రామాంజులు పేర్కొన్నారు.కార్మికుల సమస్యను పరిష్కరించడంలో మున్సిపల్ మంత్రి, ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహించడం సరికాదన్నారు. తక్షణమే జోక్యం చేసుకొని కార్మికుల న్యాయ సమ్మతమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బీవీ రమణ మాట్లాడారు. దీక్షలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఫయాజ్, సలీమ్‌లు పాల్గొని మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ సిబ్బంది అక్బర్, శంకరయ్య, ఈశ్వర్ రెడ్డి, మల్లికార్జున, రమణ, రమేష్, రమాదేవి, వెంకటలక్ష్మీ, మౌనిక, దేవా, కృష్ణారెడ్డి, బ్రహ్మయ్య, శానిటేషన్ వర్కర్స్ చెన్నయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరకట్న వేధింపుల కేసు నమోదు

సుండుపల్లె : వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు సోమవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటిలోని కొత్తపల్లె బాలాజీనగర్‌కు చెందిన సయ్యద్ అజ్మత్, రాయవరానికి చెందిన ఓ మహిళకు ఐదు సంవత్సరాల క్రితం వివాహైంది. అదనపు కట్నం తీసుకురావాలని తన భర్త మరికొందరు వేధిస్తున్నారని రాయవరానికి చెందిన జనత్ ఉన్నిసా ఫిర్యాదు మేరకు.. రాయచోటికి చెందిన సయ్యద్ అజ్మత్‌తోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

గంజాయి కేసులో మరో వ్యక్తి అరెస్ట్

సిద్దవటం : గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న కడప నగరం ఎన్‌జీఓ కాలనీకి చెందిన హేమవర్ధన్ అలియాస్ హేము అనే వ్యక్తిని సోమవారం మాధవరం-1 గ్రామ పంచాయతీ పార్వతీపురం సమీపంలోని శ్రీ శీతల గంగమ్మ గుడి వద్ద అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్‌ర ఫీ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మీడియాకు వివరాలు వెల్లడించారు. గంజాయి విక్రయిస్తూ జూలై 5వ తేదీన భాకరాపేటలో పట్టుబడిన కడపకు చెందిన రెడ్డి సురేష్ అనే నిందితుడిని అప్పట్లో విచారించగా మరో కొంత మంది పేర్లు చెప్పడం జరిగిందన్నారు. వారి కోసం పలు గ్రామాల్లో పలు ప్రదేశాల్లో తమ సిబ్బందితో గాలింపు చర్యలు చేట్టామన్నారు. ఈక్రమంలో పార్వతీపురంలోని శ్రీ శీతల గంగమ్మ గుడివద్ద కడప నగరానికి చెందిన హేమవర్ధన్ అలియాస్ హేమును అరెస్టు చేసి సిద్దవటం కోర్టులో హాజరు పరిచామన్నారు. గంజాయి కేసులో మరి కొంత మంది ఉన్నారని, వారి కోసం రహస్య విచారణ చేపడుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

గ్యాంగ్‌ల దాడులు.. ప్రజలు బెంబేలు

- రాయచోటిలో మొదలైన హింసాకాండ
- చేతుల్లో రాడ్లు, కత్తులు, ఫింగర్ గ్రిప్ కత్తులతో హల్‌చల్
- మద్యం తాగి వీధుల్లో భయభ్రాంతులు సృష్టిస్తున్న వైనం
- అధికార పార్టీ నేతల ఒత్తిడితో మిన్నకుండిన పోలీసులు



పాతరాయచోటిలో ధ్వంసమైన సమాధి



ఒక గ్యాంగ్ నుంచి ఫింగర్ గ్రిప్ ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు (ఫైల్)

రాయచోటి : ప్రశాంతంగా ఉన్న రాయచోటి పట్టణంలో.. ఇటీవల గ్యాంగుల దాడులు, ప్రతిదాడులతో పట్టణ ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. పీకలదాకా మద్యం తాగి మత్తులో చేస్తున్న దాడులు ప్రజల ప్రాణాల మీదకు తెస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పట్టణంలో బోనమల ఖాదర్‌వల్లి గ్యాంగ్, సున్నా గ్యాంగ్, కొత్తపల్లి గ్యాంగ్, కొత్తపేట రామాపురం గ్యాంగ్, పాతరాయచోటి గ్యాంగ్ ఇలా బ్యాచ్‌లుగా ఏర్పడి.. వీరంగం సృష్టిస్తున్నారు. గ్యాంగులుగా ఏర్పడి విచ్చలవిడిగా దాడులకు తెగబడుతున్నా చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు.. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో మిన్నకుండి పోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతికి శాఖాపరంగా మంచి పేరుంది. కూటమి పాలన వచ్చిన తర్వాత పట్టణంలో గ్యాంగుల దాడులు, అల్లరి మూకల అలజడి అధికం కావడంతో.. జిల్లా ఎస్పీ నేరుగా కర్నూలు జిల్లాలో పని చేస్తున్న బీవీ చలపతిని రాయచోటి అర్బన్ సీఐగా నియమించారు. సీఐ బాధ్యతలు చేపట్టిన తొలి రోజుల్లో ప్రశాంతత నెలకొంటుందని భావించిన ప్రజలకు.. అధికార పార్టీ ఆధిపత్యం ముందు అంతో ఇంతో కఠినంగా ఉండే అర్బన్ సీఐ కూడా గ్యాంగులను నిలువరించలేని పరిస్థితిలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

మైనార్టీ నేతపై కత్తులతో దాడి

కూటమి పాలన ప్రారంభమైనప్పటి నుంచి రాయచోటి పట్టణ పరిధిలో వరుస దాడులు జరుగుతున్నా వారిపైన కేసులు మాత్రం నమోదు కావడం లేదు. గత నెల 23న చిత్తూరు రింగ్ రోడ్డు, ఈ నెల 3న కొత్తపేటలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సమీపంలో, 4వ తేదీన కొత్తపేట రామాపురం పరిధిలోని నాలుగు కులాయిల వద్ద, 9వ తేదీన ట్రంక్ రోడ్డు మీద ఓ మైనార్టీ నేతపై కత్తులతో దాడులు చేసి వీరంగం సృష్టించారు. ఈ దాడులన్నీ బోమనల ఖాదర్‌వల్లి గ్యాంగ్ చేసినట్లుగా పోలీసులు చెబుతున్నారు. మిగిలిన బ్యాచ్‌లు ప్రతి రోజూ ఏదో ఒక ప్రాంతంలో పీకల దాకా మద్యం తాగి దాడులకు తెగబడుతున్నారు. పట్టణంలో సాగుతున్న వరుస దాడులతో పలువురికి గాయాలు అవుతున్నాయి. అనేక వాహనాలు దగ్ధమవుతున్నాయి. వీరిపై స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయలేని స్థితిలో పోలీసులు ఉండటం గమనార్హం. వీధిరౌడీల్లా వ్యవహరిస్తున్న వీరి తీరుతో మహిళలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. దాడులు, అల్లర్లపై వారించిన స్థానికులపై కత్తులు, రాడ్లు, ఫింగర్ గ్రిప్ కత్తులతో దాడులు చేసి గాయపరుస్తున్నారు. మైనార్టీ నేత బాషాపై బోనమల అనుచరుల దాడులు ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. ప్రశాంతత వైపు అడుగు లేస్తుంది అనుకున్న రాయచోటిలో దాడులు, ప్రతిదాడులతో.. గ్యాంగుల అలజడులు పట్టణ ప్రజలను ఆందోళన కలిగిస్తున్నాయి. అధికారమే అండగా రెచ్చిపోతున్న గ్యాంగులకు అధికార పార్టీ నాయకులు వత్తాసు పలకడంతో మరింత రెచ్చిపోతున్నారు.

సమాధులు ధ్వంసం

గ్యాంగుల దాడులు మనుషులపైన కాకుండా సమాధుల పైన కూడా కొనసాగుతుండటం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. మున్సిపల్ మేస్త్రీగా పని చేసి మృతి చెందిన అన్నయ్య సమాధిని రెండు రోజుల కిందట గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. కసి ఉన్న వ్యక్తులపై కక్షలు పెంచుకుని దాడులు చేస్తున్న వారు కొందరైతే.. రాజకీయాల పరంగా మరికొన్ని దాడులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా రాయచోటిలో గ్యాంగుల వార్ తారా స్థాయికి చేరిందనడంలో సందేహం లేదు.

కుప్పానికి నీళ్లు తీసుకెళ్తే.. మా పరిస్థితి ఏంటి?

- చెరువులకు అనుసంధానం లేకుండా పనులు ఎలా చేస్తారు?
- హంద్రీ నీవా పనులపై రైతన్నల ఆగ్రహం



తుంగావారిపల్లె హంద్రీనీవా కాలువ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

కురబలకోట : హంద్రీనీవా కాలువ ద్వారా కుప్పానికి మాత్రమే నీళ్లు తీసుకెళితే పరీవాహక ప్రాంత రైతులు, చెరువుల పరిస్థితి ఏమిటని జిల్లాలోని వివిధ మండలాల గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం తుంగావారిపల్లె పరిసర గ్రామాల రైతులు హంద్రీనీవా కాలువ పనుల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో హంద్రీనీవా నీటి ద్వారా పరీవాహక ప్రాంత చెరువులను నింపడం జరిగిందన్నారు. తద్వారా పంటలు రావడంతో పాటు భూ గర్భజలాలు పెరిగాయన్నారు. బోర్లలో నీటి మట్టం తగ్గకుండా సంరక్షణ జరిగిందన్నారు. ఇప్పుడు హంద్రీనీవా కాలువకు ఎక్కడా చెరువులకు నీళ్లు వెళ్లడానికి వీలు లేకుండా ప్లాస్టింగ్ పనులు చేపట్టడం వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. కాలువ చుట్టుపక్కల ఉన్న చెరువులు, పొలాలకు నీళ్లు చేరకపోతే వ్యవసాయం నాశనం అవుతుందన్నారు. చెరువులకు అనుసంధానానికి వీలుగా నీటి గేట్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల కేవలం కుప్పానికి మాత్రమే నీళ్లు వెళతాయన్నారు. చెరువులున్న పరీవాహక ప్రాంతాల వారు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. 'హంద్రీనీవా కాలువ నీళ్లు మాకూ కావాలి.. కుప్పానికి మాత్రమే పంపితే మేమెలా బతకాలి.. చంద్రబాబు' అంటూ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాయలసీమకు నీళ్లు అందించాలన్న ఉద్దేశానికి గండికొడుతున్నారన్నారు. ఉదాహరణకు మండలంలోని తుంగావారిపల్లెకి ఎగువన ఉన్న మల్లేశ్వర చెరువు దిగువన ఉన్న రామక్క చెరువు ఆ తర్వాత రంగమ్మ చెరువుకు చుక్క నీరు కూడా వెళ్లే అవకాశం లేదన్నారు. దీనివల్ల అన్ని విధాలా రైతులు నష్టపోతారన్నారు. ఈ విషయమై జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రికి, జిల్లా ఉన్నతాధికారులకు కూడా వినతి పత్రం ఇచ్చినా పట్టించుకోవడం లేదని రైతు నాయకుడు తుంగావారిపల్లె శంకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. హంద్రీనీవా కాలువను పరిసర ప్రాంత చెరువులకు అనుసంధానం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కుప్పానికి మాత్రమే నీళ్లు తీసుకెళ్లి కాలువ పరీవాహక ప్రాంతాలను ఎండబెట్టాలని చూస్తే రైతుల ఆగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరించారు.

చేనేతలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- ఏడాదైనా అమలు చేయని కూటమి ప్రభుత్వం
- జేసీపీ బీసీ నేతలు డిమాండ్



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చేనేత నాయకులు

రాయచోటి : ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని చేనేతలను అన్ని విధాలుగా ఆదుకోవాలని చేనేత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డిలను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. కూటమి అధికారంలోకి రావడానికి చేనేతలపై వరాల జల్లు కురిపించి ఓట్లు దండుకొని 14 నెలలు గడిచినా ఇంత వరకు చింతాకంత సాయం కూడా చేయలేదన్నారు. చేనేతలకు 100 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పిన హామీని నెరవేర్చలేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో చేనేతలకు ఏడాదికి 24 వేల రూపాయలు ఇచ్చే వారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చేనేతలకు ఏడాదికి రూ. 30 వేలు ఇవ్వాలని, జీఎస్టీ పూర్తిగా రద్దు చేయాలన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలన్నారు. 45 ఏళ్లకే పింఛన్, ఆరోగ్యశ్రీ బీమా కల్పించాలని పేర్కొన్నారు. ముద్ర రుణాలు బ్యాంకుకు లింక్ చేయకుండా.. డైరెక్ట్‌గా అందించాలన్నారు. అలాగే మరో 5 లక్షల వరకు జీరో వడ్డీతో రుణాలు అందించాలని కోరారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగస్తులు అందరూ చేనేత వస్త్రాలను ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే ప్రభుత్వ స్కూల్‌లో ఇస్తున్న స్కూల్ యూనిఫామ్ చేనేత వస్త్రాలతో తయారు చేసినవి ఇవ్వాలని విన్నవించారు. గృహాలు మంజూరు చేసి రాష్ట్ర ఆప్కో చైర్మన్ డైరెక్టర్లను త్వరగా భర్తీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో చేనేత జిల్లా అధ్యక్షులు శీలం రమేష్, చేనేత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడం నాగభూషణం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి సిబ్యాల విజయ భాస్కర్, తంబళ్లపల్లి నియోజకవర్గ చేనేత అధ్యక్షులు జి.వెంకటేశ్వర్‌రెడ్డి, చేనేత నాయకులు అనంత మునిశేఖర్, వీరబల్లి మండల చేనేత అధ్యక్షులు మోడం మదనమోహన్, గుండ్లపల్లి శ్రీనివాసులు, సిబ్యాల బాలాజీ, పురం శివయ్య, పలువురు చేనేత నాయకులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ సస్పెన్షన్



సాంబశివయ్య

రాయచోటి : అన్నమయ్య, చిత్తూరు జిల్లాల ఇన్‌చార్జి హౌసింగ్ పీడీలు సాంబశివయ్య, గోపాల్‌నాయక్‌లను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సస్పెండ్ చేసింది. అన్నమయ్య జిల్లా పీడీ హౌసింగ్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిగా పని చేస్తున్న అనగాని శ్రీహరి బదిలీ కాకుండా ఉండేందుకు లంచం అడిగిన కారణంగా.. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్‌జైన్ అన్నమయ్య జిల్లా పీడీ హౌసింగ్ సాంబశివయ్య, గోపాల్‌నాయక్‌లను సోమవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లా హౌసింగ్ ఇన్‌చార్జి పీడీగా ఉన్న గోపాల్‌నాయక్ గతంలో అన్నమయ్య జిల్లా పీలేరులో హౌసింగ్ శాఖ డీఈగా పని చేసేవారు. ఏపీ ప్రభుత్వం కాండక్ట్ రూల్స్-1991 ప్రకారం సస్పెన్షన్ చేసినట్లుగా ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఆ సమయంలో అన్నమయ్య జిల్లా పీడీ హౌసింగ్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిగా పని చేస్తున్న అనగాని శ్రీహరి బదిలీ కాకుండా ఉండేందుకు లంచం అడిగిన కారణంగా.. అన్నమయ్య జిల్లా పీడీ హౌసింగ్ గోపాల్‌నాయక్‌ను సోమవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరితోపాటు పీడీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేస్తున్న ఆర్.గురుప్రసాద్, ఆర్.సుధాకర్, రఫీక్‌లను కూడా సస్పెండ్ చేశారు. ఇన్‌చార్జి పీడీలు ఇద్దరూ పై అధికారుల నుంచి అనుమతి లేనిదే అన్నమయ్య, చిత్తూరు జిల్లా కేంద్రాలను విడిచి వెళ్లరాదని కూడా ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా హౌసింగ్ పీడీ సాంబశివయ్య ఇప్పటికే నకిలీ కుల సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందారన్న విషయంపై.. అందిన ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులు విచారణ చేస్తున్న విషయం తెలిసిందే.

సిద్దవటంలో పిచ్చికుక్క స్వైరవిహారం

ఒకే రోజు ఐదుగురిపై దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నందక్రిష్ణ

సిద్దవటం : సిద్దవటంలోని దిగువపేటలో సోమవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ఐదుగురిని కాటువేసింది. దిగువపేట గాంధీవీధిలో ఉదయం 6 ఏళ్ల బాలుడు కోటపాటి నందక్రిష్ణ దారిన వస్తుండగా ఒక్కసారిగా కుక్క వచ్చి కాటువేసింది. అలాగే అదే వీధికి చెందిన బత్తల బాలగురవయ్య, బాలింత పాలెం వసంత, బేల్దారు వీధికి చెందిన 5 ఏళ్ల బాలిక ఫాతిమా, దిగువపేట బజారు వీధిలో మరొకరిపై పిచ్చికుక్క దాడి చేసి కాటువేసింది. కుక్క కాటుకు గురైన వారు సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వ్యాక్సిన్, ఇన్‌జెక్షన్‌లను వేయించుకున్నారు. సిద్దవటంలో కుక్కలు, ఆవులను పెంచుకునే వారు ఇంటి వద్ద కట్టేసుకొని పెంచుకోవాలని, గ్రామంపై వదిలేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మహమ్మద్ రఫీ హెచ్చరించి సోమవారం సిద్దవటం గ్రామ పంచాయతీలో చాటింపు వేయించారు.

మంత్రి మండిపల్లిపై సోషల్ మీడియా పోస్టింగులు

ఖమ్మం జిల్లా వాసి అరెస్ట్..
బెయిల్‌పై విడుదల



అన్వేష్‌రెడ్డిని మీడియా ముందు హాజరు పెట్టిన రాయచోటి పోలీసులు

రాయచోటి : రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై ఫేస్‌బుక్‌లో అభ్యంతకరమైన కామెంట్ పెట్టారంటూ తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన ఎరమాల అన్వేష్ రెడ్డి(29)ని అరెస్ట్ చేసినట్లు అన్నమయ్య జిల్లా రాయచోటి అర్బన్ సీఐ వెంకటచలపతి వెల్లడించారు. ఈ నెల 12న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ప్రతిగా సోషల్ మీడియా వేదికగా అభ్యంతకరమైన కామెంట్స్ పోస్ట్ చేయడంపై మంత్రి పీఏ రామచంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఇతనితోపాటు ఎవరైనా ఉన్నారా అనే కోణంలో కూడా విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు. అదుపులోకి తీసుకున్న అన్వేష్ రెడ్డి పై కేసు నమోదు చేసి సోమవారం కోర్టుకు హాజరు పరిచామన్నారు. కోర్టు అన్వేష్ రెడ్డికి బెయిల్ మంజూరు చేసింది. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా కల్లూరు మండలానికి చెందిన అన్వేష్ రెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. వైఎస్సార్‌సీపీ అభిమాని అని తెలిసింది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మైలవరం : మండల పరిధిలోని ధన్నవాడ గ్రామానికి చెందిన పెద్ద పాపిరెడ్డి అనే రైతు అప్పుల బాధ తాళలేక పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ధన్నవాడ గ్రామానికి చెందిన పాపిరెడ్డి 10 ఎకరాల భూమిని సాగు చేస్తుండగా.. అందులో మిరప పంట వేసి నష్టాలు వచ్చాయి. అదే విధంగా ఆయనకు అనారోగ్య రీత్యా కూడా హాస్పిటల్‌లకు చాలా డబ్బులు ఖర్చు అయ్యాయి. దీంతో పంటలకు సరియైన గిట్టుబాటు ధరలు లేక అప్పులు ఎక్కువ కావడంతో మండల పరిధిలోని దొమ్మరనంద్యాల రెవెన్యూ పరిధిలో ఉన్న ప్లాట్లలో ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు ఎంత సేపటికి ఫోన్ చేస్తున్నా తీయక పోవడంతో.. ఉదయం వాకింగ్ వెళ్లిన ప్రదేశాల్లో బంధువులు గాలించడముతో మృతి చెందిన పాపిరెడ్డి కనిపించాడు. ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం రావడంతో ఎస్‌ఐ శ్యాం సుందర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు ప్రస్తుతం విశాఖపట్నం, సీతంపేట, రాజేంద్రనగర్ పవన్ విహార్ ఫ్లాట్ నెం. బి2, డోర్ నెం. 50-13-63/2 నివాసి అయిన తొల్లి నీలకంఠా రెడ్డి గారు తరఫున ఇచ్చు బహిరంగ ప్రకటన ఏమనగా.

మజర అన్నగారి పల్లి నివాసి కీర్తిశేషులు తొల్లి వెంకట రెడ్డి గారికి 4 గురు సంతానము వారు. 1) తొల్లి కృష్ణారెడ్డి, 2) తొల్లి జయరామిరెడ్డి, 3) (లేటు) తొల్లి చంద్రశేఖర్ రెడ్డి, 4) తొల్లి రఘునాదరెడ్డి అయి ఉన్నారు. నా క్లయింటు అయిన తొల్లి నీలకంఠా రెడ్డి గారు కీర్తిశేషులైన తొల్లి చంద్రశేఖర్ రెడ్డి గారికి ఏకైక మగ సంతానం అయినందున ఈ ప్రకటన దాఖలా ఆస్తి తొల్లి నీలకంఠా రెడ్డి గారికి వారసత్వరీత్యా సంక్రమించినది. అనగా తాతగారు అయిన లేటు తొల్లి వెంకటరెడ్డి గారి ద్వారా సంక్రమించినది చిత్తూరు జిల్లా (ప్రస్తుతం అన్నమయ్య జిల్లా) తంబళ్లపల్లె తాలూకా మరియు తంబళ్లపల్లి మండలం వాస్తవ్యులు అయిన (లేటు) తొల్లి వెంకట రెడ్డి గారి ద్వార దఖలు పడిన ఈ ప్రకటన ఆస్తిలో నా క్లయింటుకు 1/4 వంతు హక్కు అనుభవం కలిగి ఉన్నారు.

నా క్లయింటు తొల్లి నీలకంఠరెడ్డి గారి తండ్రి అయిన (లేటు) తొల్లి చంద్రశేఖర్ రెడ్డి గారు 1999వ సంవత్సరములో మరణించిన తదుపరి పెదనాన్న గారు అయిన తొల్లి జయరామిరెడ్డి గారు దురాశతో నా క్లయింట్ భూమిని దురుద్దేశముతో ఆక్రమించుటయ్నంతో నా క్లయింటు తల్లి గారు మరియు ఇరువురి ఆడపిల్లలకు మాయ మాటలు చెప్పి నా క్లయింటు తొల్లి నీలకంఠారెడ్డి గారికి తెలియకుండా 2007వ సంవత్సరములో విక్రయ దస్తావేజు తేదీ 26-12-2007 నెంబరు 763/2007, సబ్‌రిజిస్ట్రార్ తంబళ్లపల్లె చిత్తూరు డిస్ట్రిక్ట్ (ప్రస్తుతం అన్నమయ్య జిల్లా)లో రిజిస్ట్రర్ చేయించుకున్న విషయాన్ని నా క్లయింట్ తొల్లి నీలకంఠారెడ్డి గారికి సుమారు రెండు నెలల క్రిందట అనగా మే నెల 2025లో అతని తల్లి గారు అయిన లేటు తొల్లి చంద్రశేఖర్ రెడ్డి గారి భార్య తొల్లి విమలమ్మ గారు తెలియపరిచినారు.

తదుపరి నా క్లయింటు అయిన తొల్లి నీలకంఠా రెడ్డి గారు విచారణ జరపగా, పెద్దనాన్న గారు అయిన తొల్లి జయరామిరెడ్డి గారు మరియు తొల్లి కృష్ణారెడ్డి గారు కుమారుడు అయిన తొల్లి కిరణ్ కుమార్ రెడ్డి గారు ఇరువురు కలిసి చట్టవ్యతిరేకముగా పైన ఉదహరించిన విక్రయ దస్తావేజుద్వారా దౌర్జన్యంగా వ్రాయించుకుని తిరిగి సమాజములో విక్రయించుటకు ప్రయత్నములు జరుగు చున్నదని తెలిసినది మరియు మరియొక ఆసామి అయిన తొల్లి జయరామిరెడ్డి గారు రెండవ కుమార్తె వై.కవితారెడ్డి అను ఆమె కూడా చట్టవ్యతిరేకముగా షెడ్యూలు ఆస్తిని విక్రయించుటకు ప్రయత్నము చేయుచున్నారని తెలిసినది.

ఇందు మూలముగా ప్రజలు యావన్మందికి తెలియచేయునది ఏమనగా పైన ఉదహరించిన ఆసాములతో మా క్లయింటు అయిన శ్రీ తొల్లి నీలకంఠా రెడ్డికి సంబంధించిన షెడ్యూల్డ్ ఆస్తితో ఏ విధమైన వ్యవహారములు / లావాదేవీలు చేసిన ఎడల అవి చట్ట ప్రకారం చెల్లనేరవు మరియు ఎటువంటి లావాదేవీలు కాని వ్యవహారములు కాని జరిపిన అటువంటి వాటితో మా క్లయింటు అయిన శ్రీ తొల్లి నీలకంఠారెడ్డికి ఎటువంటి సంబంధము లేదని తెలియజేయడమైనది. ఈ ప్రకటనకు సంబంధించి ఎటువంటి అభ్యంతరములు / ఆక్షేపములు ఎమైన ఉన్నెడల ఈ ప్రకటన వెలువడిన తేదీనుండి 15 (పదిహేను) దినముల లోపు ఈక్రింది చిరునామా వారికి వ్రాతపూర్వకముగా సమర్పించవలసినదిగా తెలియజేయడమైనది.

షెడ్యూల్ :

Item No. I : Land situated at Annamayya District (Earlier called as Chittor District), Thambellapalle Sub Registrar Office, Thambellapalle Mandalam, Kolla Palle Garmam, Majara Annagaripalli, Having Patta Dar Pass Book No. CTR 30191, S.No. 196 to an extent of Ac. 2.00 Cents or 0.809 Hectors.

Item No. II : Land Situated at Annamayya District (Earlier called as Chittor District), Thambellapalle Sub Registrar Office, Thambellapalle Mandalam, Diguvapalem Panchayathi, Majara Annagaripalli Village, having Patta Dar Pass Book No. CTR 30172, Survey No's as follows : S.No. - 29 Total 03.54 Cents - Ac. 02.64 Cents 1.06 Hectors, S.No. - 51/1A Total 06.36 Cents - Ac. 01.43 Cents 0.57 Hectors, S.No. - 145/2A Total 00.35 Cents - Ac. 00.05 Cents 0.020 Hectors, S.No. 145/3B Total 00.81 Cents - Ac. 00.05 Cents 0.020 Hectors, S.No. 145/4B Total 00.79 Cents - Ac.00.05 Cents 0.020 hectors, S.No. 145/6B Total 00.04 Cents - Ac. 00.04 Cents 0.010 Hectors, S.No.-36/1 Total 02.34 Cents - Ac.00.36 Cents 0.145 Hectors, S.No. 325 total 01.60 Cents - Ac. 00.25 Cents 0.100 hectors, S.No. 332 total 02.85 Cents - Ac. 00.48 Cents 0.194 Hectors, S.No. - 321 Total 02.69 Cents - Ac. 00.40 Cents 0.162 Hectors, S.No. 320/1 Total 02.13 Cents - Ac./ 00.10 Cents 0.040 Hectors, S.No. 318/1 Total 01.13 Cents - Ac. 00.11 Cents 0.040 Hectors, S.No. 127/2 total 01.26 Cents - Ac. 00.15 Cents 0.060 Hectors

V.V.NARSIMHAM, M.Com., B.L., Advocate
Flat No. 301, 8-46-1, Surya Bhavan Apartments, Vidyanagar Colony, China Waltair Road, Old CBI Office Down, Visakhapatnam - 3, Ph : 7337375015

గ్రామకంఠం భూమి కబ్జా

కాపాడాలని అధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

పుల్లంపేట : మండల పరిధిలోని రామక్కపల్లిలో సత్యమ్మ దేవతకు చెందిన గ్రామ కంఠం భూమి కబ్జా చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు వారు సోమవారం డిప్యూటీ తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామకంఠం భూమికి తమ విన్నపాల మేరకు గ్రామ రెవెన్యూ అధికారులు అనేక సార్లు సర్వే చేసి హద్దులు నిర్ణయించారని తెలిపారు. అయినా ఆకేపాటి రామచంద్రారెడ్డి తన బంధు వర్గానికి చెందిన ఉన్నతాధికారుల బలం ఉందని.. పదేపదే రెవెన్యూ అధికారులను సైతం లెక్క చేయకుండా కొలతలు కొలిచి నాటిన హద్దు రాళ్లను జేసీబీ సాయంతో తొలగించి పొలం దున్నడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే గ్రామస్తులు పురాతన బావిని వెలికి తీసినప్పటికీ ఎటువంటి సమాచారం అందించకుండా గ్రామకంఠంలో ఉన్న బావిని దౌర్జన్యంగా పూడ్చివేయడం జరిగిందన్నారు. పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డును సైతం పగులకొట్టి సిమెంటు రోడ్డుపై పెన్సింగ్ నిర్మించారన్నారు. ఈ విషయాలపై ఆకేపాటి రామచంద్రారెడ్డిని సంప్రదిస్తే గ్రామస్తులను దుర్భాషలాడుతూ, దౌర్జన్యానికి దిగుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కావున రెవెన్యూ అధికారులు స్పందించి సదరు వ్యక్తిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకొని, గ్రామకంఠం భూమిని కాపాడాలని కోరారు. ఇందుకు స్పందించిన డిప్యూటీ తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారి గ్రామస్తులకు న్యాయం చేస్తామని తెలియజేవారు.

డెంగీ జ్వరంతో అంగన్వాడీ టీచర్ మృతి



లక్ష్మీప్రసన్న (ఫైల్)

సుండుపల్లె : డెంగీ జ్వరంతో అంగన్వాడీ టీచర్ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని జి.రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీ కొరిమివాండ్లపల్లెలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉమ్మడిశెట్టి లక్ష్మీప్రసన్న(35) కొరివివాండ్లపల్లెలో అంగన్వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తుండే వారు. ఆమెకు వారం క్రితం జ్వరం వచ్చింది. సుండుపల్లె, పీలేరులలోని ఆసుపత్రులలో చికిత్స పొందింది. రక్తపరీక్షలలో డెంగీ జ్వరం అని తేలడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి స్విమ్స్‌కు వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో సోమవారం మరణించింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

దుర్గలమ్మ ఊరేగింపులో ఘర్షణ

ఒకరికి తీవ్ర గాయాలు



గాయపడిన ధనుష్

రామసముద్రం : రామసముద్రం మండల కేంద్రంలో ఆదివారం జరిగిన దుర్గలమ్మ అమ్మవారి ఊరేగింపులో ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్‌ఐ రమేష్‌బాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీసీ కాలనీకి చెందిన ధనుష్ అమ్మవారి ఊరేగింపులో డ్యాన్స్ వేస్తుండగా.. ఎగువ పెట్రోల్ బంక్ వద్ద దిగువపాళెంకు చెందిన జగన్‌తోపాటు మరో ఇద్దరు ధనుష్‌పై బ్లేడ్‌తో దాడి చేశారు. ఈ దాడిలో ధనుష్ చెవుపైన, మెడ, వీపుపై రక్త గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గాయపడిన ధనుష్‌ను రామసముద్రం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

17న ఎక్సైజ్ వాహనాల వేలం

మదనపల్లె రూరల్ : ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 17న ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సీఐ భీమలింగ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మదనపల్లె ఎక్సైజ్‌పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 200 వాహనాలు సీజ్ చేయడం జరిగిందన్నారు. వాటిలో తొలి విడతగా 60 వాహనాలు వేలం వేసేందుకు కడప ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అనుమతి ఇచ్చారన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్‌కార్డు తీసుకుని వచ్చి డిపాజిట్ మొత్తం చెల్లించి, 17న నేరుగా వేలంపాటల్లో పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాలకు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మదనపల్లె రూరల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పెద్దమండ్యం మండలం కొరివి రెడ్డివారిపల్లెకు చెందిన నూర్‌సాబ్ కుమారుడు షబ్బీర్(23) సొంత పనులపై మదనపల్లెకు వచ్చి తిరిగి ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా, మార్గమధ్యంలోని ముదివేడు సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అదేవిధంగా నిమ్మనపల్లె మండలం నాగులయ్యగారిపల్లెకు చెందిన రామయ్య కుమారుడు వెంకటేష్(30) అల్లనేరేడు కాయలు కోతకు వెళ్లి తిరిగి మరో వ్యక్తితో కలిసి ఇంటికి వెళుతుండగా, మార్గమధ్యంలో అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో వాహనంలో నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయా ఘటనల్లో గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మహిళపై దాడి

మదనపల్లె రూరల్ : మద్యం మత్తులో తనను దూషిస్తున్న వ్యక్తిని ప్రశ్నించడంతో.. ఆమెపై దాడి చేసిన ఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. అమ్మచెరువుమిట్టకు చెందిన గంగాధర్ మద్యం సేవించి వచ్చి అదే ప్రాంతానికి చెందిన నాగరాజు భార్య జయంతి(35)ని అకారణంగా దూషిస్తుండగా, ఆమె అతడిని ప్రశ్నిస్తూ నిలదీసింది. దీంతో ఆవేశానికి లోనైన గంగాధర్, ఆమెపై దాడి చేసి కొట్టాడు. దాడిలో జయంతి గాయపడటంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మహిళ అదృశ్యం

ముద్దనూరు : మండలంలోని ఆకుతోటపల్లె గ్రామానికి చెందిన దేనేపల్లె అంకాలమ్మ (32)కనిపించకపోవడంతో సోమవారం పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. అంకాలమ్మకు ఆంజనేయులు అనే వ్యక్తితో సుమారు 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. ఈనెల 9వ తేదీన ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. అంకాలమ్మ సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అంజన్న మూలవిరాట్ దర్శనమే లక్ష్యం

- శ్రావణమాసంలో కల్పించేందుకు ఏర్పాట్లు
- ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ



మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ

చక్రాయపేట : శిలాఫలకాల్లో పేర్లు వేయించు కోవాలన్నది మా ఉద్దేశం కాదని, భక్తులకు వీరాంజనేయ స్వామి మూలవిరాట్ దర్శనం కల్పించాలన్నదే ముఖ్యమని గండి ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ టీడీపీ నేతలకు సూచించారు. గండిలో ఆలయ పాలకమండలి సభ్యులతో కలిసి సోమవారం ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేంపల్లె మండల టీడీపీ ఇన్‌చార్జి రఘునాథరెడ్డి గండి ఆలయాన్ని శనివారం పరిశీలించి విలేకరుల సమావేశంలో తమపై పలు ఆరోపణలు చేశాడన్నారు. ఆలయం పనులు సుమారు 95 శాతం పూర్తయ్యాయని, పునఃప్రతిష్ఠ చేసి భక్తులకు శ్రావణ మాసం నాటికి మూల విరాట్ దర్శనం కల్పించాలని గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, దేవ దాయ శాఖమంత్రి, కమిషనర్, బీజేపీ, కాంగ్రెస్, నేతలతోపాటు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి విజ్ఞప్తి చేశానని చెప్పారు. తమ విన్నపాలకు స్పందించి విచారణ నిమిత్తం ఆర్జేసీ, కలెక్టర్, డిప్యూటీ కమిషనర్లు గండికి వచ్చి శ్రావణ మాసం నాటికి పునః ప్రతిష్ఠ జరిపించాలని ఆదేశించారని చెప్పారు. ఆగిన పనులు తమ విన్నపాలతోనే ఊపందుకున్నాయని చెప్పారు. తాము కూటమి ప్రభుత్వంపై ఎలాంటి ఆరోపణలు చేయలేదన్నారు. పునః ప్రతిష్ఠకు సంబంధించి కనీసం 6 అడుగుల ప్రాకారం, దీపస్తంభం ఉండాలని, బలిపీఠం కావాలని అధికారులు చెప్పారని తెలిపారు. వారు చెప్పినట్లు ప్రాకారం 6 అడుగులు, దీపస్తంభం ఉందని, బలిపీఠం ఒక్కటే లేదని చెప్పారు. నాలుగేళ్లుగా భక్తులకు మూల విరాట్ దర్శనం లేదని ఇప్పుడైనా ఆ అవకాశం కల్పించాలని తాపత్రయ పడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యుడు బోరెడ్డి వెంకటరామిరెడ్డి, మాజీ బోర్డు సభ్యుడు బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.